క్లుప్తంగా

ముళ్లపొదలు తొలగిస్తాం



తిరునాంపల్లిలో ముళ్లపొదలను పరిశీలిస్తున్న ఎంపీడీఓ వీర్రాజు

యాడికి: మండలంలో అసాంఘిక కార్యాకలాపాలకు అడ్డాగా మారిన ముళ్లపొదలను తొలగిస్తామని ఎంపీడీఓ వీర్రాజు పేర్కొన్నారు. ఎస్పీ జగదీష్ ఆదేశాల మేరకు బుధవారం ఆయన తిరునాంపల్లి బస్టాండు సమీపంలో రోడ్డుకు అతి సమీపంలో ముళ్లపొదల నడుమ ఉన్న కోనేరును సచివాలయ సిబ్బందితో కలిసి పరిశీలించారు. కోనేరు పక్కనే కొన్ని ప్లాస్టిక్ సంచులు కుప్పగా ఉండటంతో ఆ ప్రాంతాన్ని అసాంఘిక కార్యకలాపాలకై వాడుతున్నట్లుగా గుర్తించారు. తిరునాంపల్లి ప్రధాన బ్రిడ్జి కింద కొందరు మహిళలు తాడిపత్రి, గుత్తి వైపు నుంచి వచ్చి విటులను ఆకర్షిస్తున్నట్లు తన దృష్టికి రావడంతో ఆ ప్రాంతాన్ని కూడా పరిశీలించానని ఎంపీడీఓ తెలిపారు.

నిధుల వినియోగంపై డీఎల్‌డీఓ విచారణ



రికార్డులను పరిశీలిస్తున్న డీఎల్‌డీఓ విజయలక్ష్మి

గుంతకల్లు రూరల్: మండలంలో 2019 నుంచి 2024 వరకూ చేపట్టిన పనులపై మండల పరిషత్ కార్యాలయంలో డీఎల్‌డీఓ విజయలక్ష్మి బుధవారం విచారణ చేపట్టారు. ధర్మ హ్యూమన్ రైట్స్ ఆర్గనైజేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీరాంజనేయులు గుంతకల్లు మండల పరిషత్ ఆధ్వర్యంలో చేపట్టిన పనులపై విచారణ చేపట్టాలంటూ ఇటీవల పంచాయతీ రాజ్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు డీఎల్‌డీఓ మండల పరిషత్ కార్యాలయంలో రికార్డులను పరిశీలించారు. విచారణ అనంతరం జెడ్పీ సీఈఓకు నివేదిక సమర్పిస్తామని ఆమె తెలియజేశారు.

వీర జవాన్ మురళీనాయక్‌కు ఘన నివాళి



మురళీ నాయక్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

గుంతకల్లు రూరల్: ఆపరేషన్ సిందూర్‌లో వీర మరణం పొందిన జవాన్ మురళీ నాయక్‌కు బుధవారం మండల వ్యాప్తంగా అన్ని తండాల్లో ఘనంగా నివాళులర్పించారు. సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి వీరభద్రస్వామి ఆధ్వర్యంలో నాయకులు బుధవారం మండలంలోని తండాల్లో పర్యటించారు. ఈసందర్భంగా వీరజవాన్ మురళీనాయక్ చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. మురళీనాయక్ పోరాట పటిమను, అతడి కుటుంబ పరిస్థితిని తండా వాసులకు వివరించారు.

మట్కా బీటర్ అరెస్ట్

గుంతకల్లు రూరల్: స్థానిక దోనిముక్కల రోడ్డు సమీపంలోని ఇందిరమ్మ కాలనీలో ఆన్‌లైన్ ద్వారా మట్కా నిర్వహిస్తున్న ఓ వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాలు..గుత్తికి చెందిన మల్లికార్జున చౌదరి కొద్దికాలంగా దోనిముక్కల ఇందిరమ్మ కాలనీలో ఒక ఇంటిని అద్దెకు తీసుకొని ఆన్‌లైన్ ద్వారా మట్కా బీట్ నిర్వహిస్తున్నాడు. సమాచారం అందుకున్న రూరల్ పోలీసులు మంగళవారం అర్ధరాత్రి దాడులు నిర్వహించి అతడిని అరెస్ట్ చేశారు. నిందితుడి నుంచి రూ.52 వేలు నగదు స్వాధీనం చేసుకున్నట్లు రూరల్ ఎస్‌ఐ రాఘవేంద్రప్ప తెలిపారు.

చిన్నారుల సంరక్షణపై దృష్టి సారించాలి



పోస్టర్ విడుదల చేస్తున్న దృశ్యం

బుక్కరాయసముద్రం: చిన్నారుల సంరక్షణపై తల్లిదండ్రులు ప్రత్యేక దృష్టి పెట్టాలని సీడీపీఓ ఉమా శంకరమ్మ సూచించారు. బాట్లో కొత్తపల్లిలో బుధవారం పిల్లల సంరక్షణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ మాట్లాడుతూ వేసవి సెలవుల్లో పిల్లలు బోరు బావులు, నీటి కుంటలు, కాలువలు, వంకల వద్దకు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పిల్లలను ఒంటరిగా వదిలేయరాదన్నారు. గ్రామాల్లో బాల్య వివాహాలు జరుగుతున్నట్లు తెలిస్తే చైల్డ్‌లైన్ 1098కు సమాచారం ఇవ్వాలన్నారు. పిల్లల ఆరోగ్యంపై సలహాలు సూచనలు తెలిపారు. అనంతరం ఇందుకు సంబంధించి పోస్టర్ విడుదల చేశారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగమణి, అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ భవనం ప్రారంభించేదెన్నడో?



ప్రారంభానికి నోచుకోని సచివాలయ భవనం



సచివాలయ సిబ్బంది విధులు నిర్వహిస్తున్న పంచాయతీ భవనం



పంచాయతీ భవనం పైకప్పు పెచ్చులూడిన దృశ్యం

- నక్కనదొడ్డిలో పూర్తయిన భవన నిర్మాణం
- పంచాయతీ కార్యాలయంలోనే సచివాలయం నిర్వహణ
- పైకప్పు పెచ్చులూడుతున్న పంచాయతీ భవనం
- ఆందోళనలో సచివాలయ సిబ్బంది

గుంతకల్లు రూరల్: నక్కనదొడ్డి గ్రామంలో సచివాలయ భవనం పూర్తయినా ప్రారంభానికి నోచుకోవడం లేదు. మరోవైపు సచివాలయ సిబ్బంది శిథిలావస్థకు చేరిన పంచాయతీ కార్యాలయంలో బిక్కుబిక్కుమంటూ విధులను నిర్వహించాల్సి వస్తోంది. వివరాలు.. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నక్కనదొడ్డిలో సచివాలయ భవనం కోసం రూ.40 లక్షలు మంజూరు చేశారు. 2024 ఎన్నికల సమయానికి ముందే భవన నిర్మాణ పనులు పూర్తయ్యాయి. ప్రస్తుత కూటమి ప్రభుత్వం మాత్రం ఏడాది కావొస్తున్నా సచివాలయ భవనాన్ని ప్రారంభించిన పాపాన పోలేదు. దీంతో గ్రామంలోని పంచాయతీ కార్యాలయం నుండే సచివాలయ విధులు నిర్వర్తించాల్సి వస్తోంది.

శిథిలావస్థలో పంచాయతీ భవనం

సచివాలయ వ్యవస్థ ప్రారంభం కాగానే గ్రామంలోని పంచాయతీ కార్యాలయంలో అధికారులు సచివాలయాన్ని ప్రారంభించారు. పంచాయతీ భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరుకోవడంతో పైకప్పునుంచి తరచూ పెచ్చులూడుతున్నాయి. కొన్నిసార్లు సీలింగ్ నుంచి ఊడిన పెచ్చులు సచివాలయంలో ఏర్పాటు చేసిన కంప్యూటర్లపై కూడా పడ్డాయి. దీంతో సిబ్బంది కార్యాలయంలోని కంప్యూటర్లను ఇతర సామగ్రిని ఒక మూలన ఏర్పాటు చేసుకున్నారు. పెచ్చులూడే సమస్య రోజురోజుకూ పెరిగిపోతుండటం, దానికితోడు త్వరలో వర్షాకాలం కూడా ప్రారంభం కానుండటంతో ఏసమయంలో ఏమి జరుగుతుందోనని సిబ్బంది భయాందోళనకు గురవుతున్నారు.

మండల మీట్‌లో చెప్పినా పట్టించుకోవడం లేదు...



పాతబడిన పంచాయతీ భవనం పాతబడటంతో తరచూ పెచ్చులూడి పడుతోంది. గ్రామంలో సచివాలయ భవన నిర్మాణం దాదాపు పూర్తయింది. కరెంటు, నీటి సరఫరా మాత్రమే పెండింగ్‌లో ఉంది. ఈ రెండు పనులు పూర్తి చేసి భవనాన్ని ప్రారంభించాలని మండల మీట్‌లో పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకొస్తున్నా పట్టించుకోవడం లేదు.

–చిన్న ఆంజనేయులు, ఎంపీటీసీ సభ్యుడు

నిర్మాణ పనులు పూర్తి



కరెంటు, నీటి సరఫరా మినహా ఎన్నికల సమయానికి ముందే సచివాలయ భవన నిర్మాణం పూర్తయింది. అదే సమయంలో ప్రభుత్వం సచివాలయాల నిర్మాణానికి అదనంగా మరో రూ.3.6 లక్షలను మంజూరు చేసినట్లు తెలిసింది. పెండింగ్‌లో ఉన్న రూ.3 లక్షలను మంజూరు చేస్తే మిగిలిన పనులను పూర్తి చేస్తానని చెప్పినా మండల ఇంజినీర్ పట్టించుకోవడం లేదు.

– సుంకన్న, బిల్డింగ్ కాంట్రాక్టర్

పనులు పూర్తి చేస్తేనే బిల్లు



బిల్డింగ్ నిర్మాణం దాదాపు పూర్తయింది. సెప్టిక్ ట్యాంక్‌తోపాటు, కరెంటు, నీటి సరఫరా పనులు పెండింగ్‌లో ఉన్నాయి. నిర్మాణ పనులకు సంబంధించి రూ.3 లక్షలతో పాటు, అదనంగా మంజూరు చేసిన రూ.3.6 లక్షల నిధులు పెండింగ్‌లో ఉన్నమాట వాస్తవమే. కానీ బిల్డింగ్ నిర్మాణం పూర్తయ్యే వరకూ బిల్లులు మంజూరు చేయడం కుదరదు.

– ఓబులేసు, మండల ఇంజినీర్

తమ్ముళ్ల కుమ్ములాటలు ఆగేనా?

- నేడు టీడీపీ కార్యకర్తలతో మంత్రి లోకేష్ సమావేశం



తనపై దాడి చేశారని చెబుతున్న టీడీపీ సీనియర్ నేత కోనంకి కృష్ణ

గుత్తి: కూటమి ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి తెలుగు దేశం పార్టీలో కుమ్ములాటలు అధికమయ్యాయి. గురువారం ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మంత్రి లోకేష్ గుత్తి పట్టణంలో కార్యకర్తలతో సమావేశం కానున్నారు. ఈ నేపథ్యంలో నాయకుల మధ్య తగవులకు ఫుల్‌స్టాప్ పడుతుందా అని ఉత్కంఠతో పార్టీ శ్రేణులు ఎదురు చూస్తున్నాయి. ఇటీవల పార్టీలో సీనియర్ నాయకుడు జిలాన్‌ను పార్టీ ఆఫీస్‌కు పిలిపించి పలువురు దాడికి ప్రయత్నించారు. టీడీపీకి చెందిన మెడికల్ స్టోర్ నిర్వాహకుడిపై కూడా చెయ్యి చేసుకున్నారు. వారించడానికి ప్రయత్నించిన వారిపైనా దాడికి యత్నించారు. ఈ క్రమంలో మూడు రోజుల క్రితం సీనియర్ నేత కోనంకి కృష్ణపై కూడా పార్టీ కార్యాలయంలోనే దాడి చేయడంతో పాటు నానా దుర్భాషలాడారు. దాడి ఘటనపై బాధితుడు కోనంకి కృష్ణ పోలీసు స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశారు. నాలుగు రోజుల క్రితం టీడీపీ మండల స్థాయి నాయకులు ఇద్దరు గుత్తిలోని బస్టాండ్ సమీపంలో చెప్పులతో పరస్పరం దాడి చేసుకున్నారు. ఇక స్థానిక ప్రజా ప్రతినిధిపై అనేక ఫిర్యాదులు పార్టీ అధిష్టానానికి అందాయి. బయటికి రాని దాడులు, ఘర్షణలు, కుమ్ములాటలు చాలానే ఉన్నాయి. లోకేష్ క్రమశిక్షణ చర్యలు తీసుకుని నాయకులను గాడిలో పెడతారో లేదోనని ఆసక్తితో ఎదురుచూస్తున్నారు.

చెరువులకు కృష్ణాజలాలు విడుదల చేయాలి



మాట్లాడుతున్న ఐటీ వింగ్ జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి

గుత్తి రూరల్: హంద్రీ-నీవా కాలువ వెడల్పు చేసి జిల్లాలోని అన్ని చెరువులకు కృష్ణాజలాలు విడుదల చేయాలని వైఎస్సార్‌సీపీ ఐటీ వింగ్ జిల్లా అధ్యక్షుడు వై.రాజశేఖర్‌రెడ్డి డిమాండ్ చేశారు. రజాపురం గ్రామంలో బుధవారం ఐటీ వింగ్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుత్తి మండలం అభివృద్ధిపై కూటమి ప్రభుత్వం చిన్నచూపు చూస్తోందన్నారు. గుత్తి పట్టణానికి రోజు తాగునీటిని అందిస్తామని చెప్పి ఓట్లేయించుకొని గెలిచిన తరువాత హామీలను తుంగలోకి తొక్కారన్నారు. గుత్తి బస్టాండ్‌ను అభివృద్ధి చేసి బస్సుల సంఖ్య పెంచాలన్నారు. గుత్తి ఆసుపత్రిలో ట్రామా కేర్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలన్నారు. గుత్తి కోట అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ బాలుర జూనియర్, డిగ్రీ కళాశాలలు ఏర్పాటు చేయాలన్నారు. గుత్తి మీదుగా అనేక రైళ్లు వెళ్తున్నాయని వాటిని గుత్తి స్టేషన్‌లో ఆపాలన్నారు. ఆసుపత్రిలో సరైన వైద్యులు లేక చిన్న చిన్న రోగాలకు సైతం అనంతపురం వెళ్లాల్సి వస్తోందని గుత్తి ఆసుపత్రిని అభివృద్ధి చేయాలన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు రామరంగారెడ్డి, గోపాల్‌రెడ్డి, కొండయ్య, నరేష్ పాల్గొన్నారు.

నాటుసారాతో జీవితాలు నాశనం



మాట్లాడుతున్న తహసీల్దార్ ప్రతాప్‌రెడ్డి

యాడికి: నాటుసారాతో కుటుంబాలు నాశనమవుతాయని తహసీల్దార్ ప్రతాప్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం తహసీల్దార్ కార్యాలయంలో గుత్తి ఎక్సైజ్ సీఐ మోహన్‌రెడ్డి, యాడికి ఎస్‌ఐ రమణయ్యతో తహసీల్దార్ నవోదయం 2.0 గురించి మాట్లాడారు. తహసీల్దార్ మాట్లాడుతూ నాటు సారా తయారీలో విషపూరిత, రసాయనాల మిశితంతో అనేక దుష్ఫలితాలు చోటు చేసుకుంటాయన్నారు. నాటుసారాతో కలిగే అనర్థాలపై గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ప్రభుత్వం పథకాలను ఉపయోగించుకునే జీవితాలను తీర్చిదిద్దుకునేలా చైతన్యం తేవాలన్నారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐ వెంకటేష్, సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి పనులు నాణ్యతగా చేయించండి



ఉపాధి పనుల మస్టర్‌ను పరిశీలిస్తున్న ఎంపీడీఓ వాసుదేవరెడ్డి

యల్లనూరు: మండలంలో ఉపాధిహామీ పనులు నాణ్యతగా చేయించాలని ఎంపీడీఓ వాసుదేవరెడ్డి సిబ్బందిని ఆదేశించారు. బుధవారం కల్లూరు పంచాయతీలో జరుగుతున్న ఉపాధి పనులను ఆయన పరిశీలించారు. పని ప్రదేశంలో ఉన్న మస్టర్లను తనిఖీ చేశారు. మస్టర్లల్లో ఖాళీగా ఉన్న గళ్లను ఎంపీడీఓ కొట్టివేశారు. బినామీ పేర్లు రాస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మేట్లు, ఉపాధి సిబ్బందిని హెచ్చరించారు. ఆయన వెంట ఈసీ, ఇన్‌చార్జ్ ఏపీఓ సత్యమూర్తి, టెక్నికల్ అసిస్టెంట్ హరికుమార్ ఉన్నారు. అనంతరం ఆయన మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి సిబ్బందికి ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. జాబ్‌కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ ఉపాధి పనులు కల్పించాలని సిబ్బందిని ఆదేశించారు. టెక్నికల్ అసిస్టెంట్లు కుళ్లాయిస్వామి, పురుషోత్తంనాయుడు, ప్రసాద్, చంద్రశేఖర్‌రెడ్డి, ఫీల్డ్‌అసిస్టెంట్లు పాల్గొన్నారు.

శుభవార్త సభలు జయప్రదం చేయండి

పామిడి: పట్టణంలోని బైపాస్ హనుమాన్‌లింకు రోడ్డు సర్కిల్ వద్ద శాశ్వత కృపా మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో ఈనెల 19 నుంచి మూడు రోజుల పాటు జరిగే అందరికీ రక్షణ శుభవార్త సభలను జయప్రదం చేయాలని నిర్వాహకులు విజయ్ ఛార్లెస్, ప్రభాకర్ ఛార్లెస్, పీటర్ విజయ్ కోరారు. రోజూ సాయంత్రం 6 గంటలకు గుంటూరు యూదా మినిస్ట్రీస్ పాస్టర్ కే నెహెమ్యా క్రీస్తు సందేశాలను వినిపిస్తారన్నారు.

వ్యక్తి మృతి

గార్లదిన్నె: రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్‌ఐ గౌస్‌మహమ్మద్ బాషా పేర్కొన్నారు. ఈనెల 6న తెలంగాణ రాష్ట్రం, మహబూబ్‌నగర్ జిల్లా కోసిగికి చెందిన బజారప్ప(51) బైక్‌పై వస్తూ తలగాచిపల్లి క్రాస్ వద్దకు ప్రమాదవశాత్తూ కిందపడ్డాడు. ఘటనలో తలకు తీవ్రగాయాలు కావడంతో అతడిని అనంతపురం సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రికి తరలించారు. తర్వాత కుటుంబ సభ్యులు మహబూబ్‌నగర్‌కు తరలించగా అక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. ఈమేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

అధికారుల తీరు.. సిబ్బంది బేజారు!

- రికార్డుల తనిఖీకి రావాలని ఐసీడీఎస్ అధికారుల ఆదేశం
- సాయంత్రం వరకూ పడిగాపులు కాసిన అంగన్‌వాడీ సిబ్బంది



ఉన్నతాధికారుల రాక కోసం జేసీ పార్క్‌లో వేచి చూస్తున్న అంగన్‌వాడీ వర్కర్లు

తాడిపత్రి: ఐసీడీఎస్ అధికారుల తీరుతో అంగన్‌వాడీ సిబ్బంది అగచాట్లు పడ్డారు. రికార్డుల తనిఖీకి ఉదయం 10 గంటలకు రావాలని చెప్పిన అధికారులు మధ్యాహ్నం దాటినా రాకపోవడం గమనార్హం. తాడిపత్రి ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలో అంగన్‌వాడీ కేంద్రాలకు 2020లో సరఫరా అయిన కోడిగుడ్ల వివరాలకు సంబంధించిన రికార్డులతో అంగన్‌వాడీలు హాజరుకావాలని రెండు రోజుల క్రితం తాడిపత్రి ఐసీడీఎస్ అధికారులు ఆదేశాలు జారీ చేశారు. బుధవారం ఉదయం 10 గంటలకు పట్టణ సమీపంలోని రమణ మహర్షి ఆశ్రమానికి రావాలని సూచించారు. దీంతో తాడిపత్రి ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలోని తాడిపత్రి, పుట్లూరు, యల్లనూరు, యాడికి, పెద్దపప్పూరు, మండలాల పరిధిలోని అంగన్‌వాడీ టీచర్లు సంబంధిత రికార్డులతో నిర్దేశిత సమయానికి రమణ మహర్షి ఆశ్రమానికి చేరుకున్నారు. కానీ అధికారులు మాత్రం మధ్యాహ్నం 2 గంటలైనా రాకపోవడంతో అంగన్‌వాడీలు తీవ్ర అగచాట్లు పడ్డారు.

వేదిక మార్చారు.. అగచాట్లు పెంచారు..

మధ్యాహ్నం అంగన్‌వాడీలు వెంట తెచ్చుకున్న క్యారేజీలలోని భోజనం చేయగానే ఉన్నతాధికారుల రాక ఆలస్యం కానుందని తెలిసి సమావేశంతో పాటు రికార్డుల పరిశీలన ఉంటుందని, ఐసీడీఎస్ అధికారులు రమణ మహర్షి ఆశ్రమం సమీపంలోని పెన్నానది తీరం పక్కనే ఉన్న జేసీ పార్క్‌లోకి వేదికను మార్చారు. దీంతో 2 గంటల అనంతరం సాయంత్రం 4.30 గంటల వరకు అంగన్‌వాడీలు ఉగ్గపట్టలేక, ఉండలేక, ఎండవేడిమితో ఎదురవుతున్న ఉక్కపోతకు అల్లాడిపోయారు. ఇదిలా ఉండగా పీడీ నాగమణి, ఆర్‌జేడీ కార్యాలయ సీడీపీఓ సౌజన్య కుమారి, సీడీపీఓ షాజిదా బేగం అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా అయిన అప్పటి కోడిగుడ్లు, అప్పట్లో అంగన్‌వాడీ లబ్ధిదారులకు పంపిణీ తదితర వివరాలతో కూడిన రికార్డులను పరిశీలించారు.

ఐసీడీఎస్‌లో అవినీతిపై విచారణ



గుత్తి ఐసీడీఎస్ కార్యాలయంలో విచారణ చేస్తున్న అధికారులు

గుత్తి: స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్ట్‌లో జరిగిన అవినీతి, అక్రమాలపై బుధవారం అధికారులు విచారణ చేపట్టారు. కర్నూలు ఐసీడీఎస్ జేడీ కార్యాలయానికి చెందిన సీడీపీఓ సౌజన్య, సీనియర్ అసిస్టెంట్ సురేష్ సిబ్బందితో స్థానిక ప్రాజెక్టు కార్యాలయంలో వివరాలు సేకరించారు. 2020 జనవరిలో కోడిగుడ్లు, ఏప్రిల్‌లో బాల సంజీవని అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా కాలేదు. దీనిపై అప్పటి సీడీపీఓ నాగమణి,, అంగన్‌వాడీ కార్యకర్తలను కార్యాలయానికి పిలిపించి వివరాలు రాబట్టారు. అలాగే రికార్డులను పరిశీలించారు. నివేదికను కర్నూలు జేడీ కార్యాలయంలో అందజేస్తామని అధికారులు తెలియజేశారు.

అలా సేకరించి.. ఇలా తగలెట్టేసి!



సేకరించిన చెత్తను కాల్చేస్తున్న దృశ్యం

చెత్తను సేకరించి సంపద కేంద్రాలకు తరలించి సంపద సృష్టించాలని ప్రభుత్వం పంచాయతీల్లో రూ.లక్షలు వెచ్చించి సంపద తయారీ కేంద్రాలను నిర్మించింది. అయితే పంచాయతీ సిబ్బంది మాత్రం చెత్తను సేకరించి గ్రామ శివార్లలో రోడ్డు పక్కనే పడేస్తున్నారు. ఇంతటితో ఆగకుండా ఆ చెత్తకు నిప్పుపెడుతున్నారు. దీంతో అటువైపు వెళ్లే వాహనదారులు పొగతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పంచాయతీ సిబ్బంది నిర్వాకంతో ప్రభుత్వం చెత్త నుంచి సంపద సృష్టించాలనే లక్ష్యం నీరుగారుతోంది.

పెద్దపప్పూరు:

యాడికి వైద్యాధికారిగా సుమంత్‌రెడ్డి



యాడికి: స్థానిక పీహెచ్‌సీలో వైద్యాధికారి-2గా సాయి సుమంత్‌రెడ్డి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన స్వస్థలం కడప జిల్లా యర్రగుంట్ల. ప్రజలకు అందుబాటులో ఉండి మెరుగైన సేవలందిస్తానని డాక్టర్ సాయి సుమంత్ రెడ్డి ఈసందర్భంగా తెలియజేశారు.

ప్లాస్టిక్ కవర్లు వాడితే చర్యలు తప్పవు



మాట్లాడుతున్న ఎంపీడీఓ తేజోత్స్న

పామిడి: పట్టణంలోని జూన్ 1 నుంచి ప్లాస్టిక్ కవర్లు వాడడాన్ని జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు నిషేధించామని, నిషేధిత ప్లాస్టిక్ వాడితే చర్యలు తప్పవని ఎంపీడీఓ కే. తేజోత్స్న హెచ్చరించారు. బుధవారం స్థానిక పంచాయితీ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన వ్యాపారస్తుల సమావేశంలో ఎంపీడీఓ, ఈఓ ఎం.గోపాల్ మాట్లాడారు. ప్లాస్టిక్ కవర్లతో జరిగే హాని నేపథ్యంలో వాటిని నిషేధించామని, ఇందుకు వ్యాపారులు సహకరించాలన్నారు. తమ షాపుల్లో పొడి, తడి చెత్తలకు వేర్వేరుగా బుట్టలను ఏర్పాటు చేసుకొని పంచాయితీ పారిశుద్ధ్య కార్మికులకు అందించాలన్నారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరా పరిశుభ్రత పాటిచాలని కోరారు. పంచాయితీ సిబ్బంది, వ్యాపారస్తులు పాల్గొన్నారు.

ఏపీఆర్‌జేసీ, పాలిటెక్నిక్ ఫలితాల్లో ప్రతిభ



దాక్షిణ్య

తాడిపత్రిటౌన్: పట్టణానికి చెందిన మోడల్ స్కూల్ విద్యార్థిని దాక్షిణ్య బుధవారం విడుదలైన పాలిటెక్నిక్, ఏపీఆర్‌జేసీ ఫలితాల్లో ప్రతిభచాటింది. పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్షల్లో 120 మార్కులకు గాను 114 మార్కులతో 640 వ ర్యాంక్ సాధించింది. అలాగే ఏపీఆర్‌జేసీ ఫలితాల్లో 116 ర్యాంక్ కైవసం చేసుకుంది. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థినిని అభినందించారు.

రికార్డులు లేకుంటే కఠిన చర్యలు



రికార్డులను పరిశీలిస్తున్న సీఐ పుల్లయ్య

బుక్కరాయసముద్రం: రికార్డులు లేకుండా వాహనాలను నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ పుల్లయ్య వాహనదారులను హెచ్చరించారు. బుధవారం సాయంత్రం మండల కేంద్రంలోని నార్పల క్రాసింగ్ వద్ద వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ వాహనదారులు వాహనాలు నడిపేటప్పుడు తప్పనిసరిగా రికార్డులు దగ్గర ఉంచుకోవాలన్నారు. ప్రతి వాహన డ్రైవర్ డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలన్నారు. వాహనాలు నడిపేటప్పుడు మద్యం సేవించి, సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడపరాదన్నారు. ఆటో డ్రైవర్లు పరిమితికి మించి ప్రయాణికులను తరలిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఈసందర్భంగా నిబంధనలకు విరుద్ధంగా వాహనాలు నడుపుతున్న పలువురికి జరిమానా విధించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

జూదరుల అరెస్ట్

తాడిపత్రి: చుక్కలూరు గ్రామ సమీపంలో పేకాటాడుతున్న ఏడుగురు జూదరులను బుధవారం అరెస్ట్ చేసినట్లు రూరల్ సీఐ శివగంగాధర్‌రెడ్డి తెలిపారు. నిందితుల నుంచి రూ.10,020 నగదు స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేశామన్నారు.